TGTEL/26/A6221



తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 32 | శుక్రవారం | 28-ఆగస్టు -2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue:32 | Friday | 28-8-2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/- |

# మరో ఘోరం

- పల్నాడులో ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఏడుగురు మృతి
- పుట్టిన రోజు వేడుకలకు ఆటోలో వెళ్లి వస్తున్న
- ఒకే గ్రామానికి చెందిన 15 మంది
- చిలకలూరిపేటలో ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
- మృతుల్లో ఆరుగురు మహిళలు..
- నలుగురు చిన్నారులు సహా 8 మందికి గాయాలు
- బాధితులంతా ఒకే గ్రామానికి చెందిన బంధువులు




చిలకలూరిపేట:వారందరిదీ ఒకే గ్రామం.. అంతా బంధువులు. చిన్నారి పుట్టినరోజు వేడుకకు వెళ్లారు. రోజంతా సంతోషంగా గడిపారు. ఆనందంగా పుట్టినరోజు వేడుక చేసుకున్నారు. ఆ తర్వాత ఆటోలో స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. కాసేపట్లో గ్రామానికి చేరుకోవాల్సిన సమయంలో ఊహించని ఘోరం జరిగింది. ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన చవుటుపల్లి లక్ష్మమ్మ చెల్లెలు పలకలూరు సుబ్బులమ్మ ప్రకాశం జిల్లా జే పంగులూరు మండలం కొండ మంజులూరులో ఉంటోంది. సుబ్బులమ్మ మనవడు మరియబాబు కుమార్తె నక్షత్ర తొలి పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ వేడుకకు వేలూరు నుంచి బంధువులు 15మంది ఆటోలో వెళ్లారు. రాత్రి పొద్దుపోయే వరకు వేడుకలో పాల్గొన్నారు. విందు భోజనాలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. చిలకలూరిపేటకు చేరుకుని.. పురుషోత్తమపట్నం

- మిగతా 2వ పేజీలో



# 290 మంది

# భారతీయుల ఆచూకీ గల్లంతు

## నేపాల్‌లోని భోటే కోశి నదికి భారీ వరదలు

- 290 మంది భారతీయుల ఆచూకీ లేదన్న కేంద్రం
- గల్లంతైన వారిలో తమిళనాడుకు చెందిన కైలాస యాత్రికులు
- మొత్తం 517 మంది విదేశీయులతో పాటు 644 మంది ఆచూకీ గల్లంతు
- సహాయక చర్యలు ముమ్మరం.. ఇప్పటివరకు 389 మృతదేహాలు

నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తడంతో ఘోర విషాదం చోటుచేసుకుంది. భోటే కోశి నదికి వచ్చిన ఆకస్మిక, ప్రచండ వరదల కారణంగా 290 మంది భారతీయులతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయని, వారి ఆచూకీ తెలియడం లేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఆందోళన వ్యక్తం చేసింది. నేపాల్‌లో సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో వందల మంది విదేశీయులు గల్లంతయ్యారు. విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిలో రసువా జిల్లాలోని త్రిశూలి-× జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది భారతీయ కార్మికులు ఉన్నారు. వీరితో పాటు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన 21 మంది యాత్రికులు కూడా గల్లంతైన వారిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

- మిగతా 2వ పేజీలో



# జన్‌ధన్ ఖాతాలు 59 కోట్లు

- డిపాజిట్లు రూ.3.17 లక్షల కోట్లు
- అకౌంట్లలో సగటు నిల్వ రూ.5,356
- సగానికి పైగా ఖాతాలు మహిళలవే
- గ్రామీణ ప్రాంతాల వాటా 78 శాతం
- 41.29 కోట్ల మందికి రూపే డెబిట్ కార్డులు
- పుష్కరకాలం పూర్తి చేసుకున్న పీఎంజేడీవై

2లో

న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక సమ్మిళిత సాధనే లక్ష్యంగా కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) విజయవంతంగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంది. బ్యాంకింగ్ సేవల పరిధిలో లేని వారికి, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి బ్యాంకింగ్, ఆర్థిక సేవలను అందించడమే లక్ష్యంగా 2014

# టూరిజం హబ్‌గా 'మీరాలం'

- ఆకస్మికంగా చెరువు పనుల పరిశీలన
- వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలి..
- గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్: చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీరాలం చెరువుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రూపునివ్వనుంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలో మీరాలం చెరువును సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీరాలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను సీఎం పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అయితే, మీరాలం చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసు కోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. చెరు వు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

- మిగతా 2వ పేజీలో



# రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి

- ప్రామాణికత, భాగస్వామ్యం కోరుకుంటున్న జెన్ జీ యువత
- ఇగోను పక్కనపెట్టి యువతను భాగస్వామ్యం చేయాలన్న లోకేశ్
- నియోజకవర్గాల్లో యువత, ఇన్‌ఫ్లుయెన్సర్లతో చర్చిస్తామని వెల్లడి
- యువత నుంచి అద్భుతమైన ఆలోచనలు వస్తున్నాయని వ్యాఖ్య
- ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా అవార్డుల కార్యక్రమంలో కీలక ప్రసంగం

# విద్యార్థులేమైనా టెర్రరిస్టులా?

- ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ పిల్లల గొంతు నొక్కుతారా?
- జీఓ 97 రద్దు చేసి ఏపీ, ఢిల్లీ తరహాలో తప్పును వెనక్కి తీసుకోవాలి
- ఢిల్లీకో నీతి, తెలంగాణకో నీతా? రాహుల్ తెలంగాణకు ఎందుకు రారు?
- దేశంలో ఆరు డీఏలుపెండింగ్‌లో పెట్టిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుదే
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా.. అరెస్టు



2లో

# 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..

- అహ్మదాబాద్ వేదికగా పలు అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్లాన్
- 2030 కామన్వెల్త్, 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌పై కూడా చర్చ
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా మార్చడమే లక్ష్యమన్న అమిత్ షా
- సన్నాహకాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న హోంమంత్రి





# కర్ణాటకలో గోల్డ్ హంట్.. దేవదుర్గ గనిపై భట్టి ఫోకస్..

- దేవదుర్గలో బంగారం, రాగి అన్వేషణకు శ్రీకారం
- సింగరేణికి దక్కిన ఎక్స్‌ప్లోరేషన్ హక్కులతో పనులు
- మైనింగ్ ప్రాజెక్టుతో యువతకు భారీగా ఉపాధి అవకాశాలు
- సైట్ ఆఫీస్, హెలిప్యాడ్ ఏర్పాటుకు భట్టి ఆదేశాలు

కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో

# కర్ణాటకలో గోల్డ్ హంట్.. దేవదుర్గ గనిపై భట్టి ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించి, ఖనిజ అన్వేషణ ప్రదేశాలను స్వయంగా పరిశీలించారు. 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ హక్కులను దక్కించుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి దక్కడంతో పాటు ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణ వేగవంతం చేసేందుకు సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని సాంస్కృతిక బంధం ఉందని, స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును విజయవంతం చేసి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దామని కోరారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, గతంలో తాను ఇక్కడ సీఐగా పనిచేశానని, ఇప్పుడు సింగరేణి అధినేతగా బంగారు, రాగి నిక్షేపాల అన్వేషణ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు లింగదహళ్ళి చేరుకున్న భట్టి విక్రమార్కకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం, ఆయన లింగదహళ్ళిలోని చారిత్రక శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లో అంతర్జాతీయ క్రీడా సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా సన్నాహకాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ బిడ్డింగ్ ప్రక్రియ పురోగతిని, క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ఒలింపిక్స్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029లో జరగనున్న పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌ను కూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం అనంతరం అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను నిర్వహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా నిలబెట్టడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో క్రీడల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులు అమిత్ షాకు వివరించారు. ఇటీవల గ్లాస్గోలో 2026 కామన్వెల్త్ గేమ్స్ ముగిసిన తర్వాత, తదుపరి ఆతిథ్య నగరంగా అహ్మదాబాద్ తరఫున గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అందుకున్న విషయం విదితమే.

# రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి

రాజకీయ పార్టీలు, నాయకులు తమ సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, పాలనలో, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగస్వాములను చేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయాలు మారాల్సిన అవసరం ఉందని, వారిని తక్కువ అంచనా వేయరాదని హితవు పలికారు. బుధవారం నాడు ముంబైలో జరిగిన 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డుల కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు, పాలనలో యువత భాగస్వామ్యంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువతరంతో నా అనుభవం ద్వారా నేను నేర్చుకున్న అతిపెద్ద పాఠం చాలా సులభమైంది. వారిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు, వారిని తక్కువ చేసి మాట్లాడొద్దు. వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములను చేయాలి" అని అన్నారు. రాజకీయాల్లో యువత ప్రాధాన్యంపై ప్రస్తుత చర్చకు చాలా కాలం ముందే తాను, తమ ముఖ్యమంత్రి గారు యువతతో మమేకమవుతున్నామని లోకేశ్ గుర్తుచేశారు. తాము ఒక నియోజకవర్గానికి వెళ్లినప్పుడు, అక్కడి యువత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేకంగా సమావేశమవుతామని వివరించారు. "'మేము ఇంకా మెరుగ్గా ఎలా చేయగలం?', 'ఈ నియోజకవర్గంలో విభిన్నంగా ఏం చేయొచ్చు?' అని వారిని అడుగుతాం" అని తెలిపారు. ఇలాంటి నిర్మాణాత్మక చర్చల నుంచి ఎన్నో అద్భుతమైన ఆలోచనలు పుట్టుకొస్తాయని, వాటిని కేవలం వినడమే కాకుండా, అమలు చేయడానికి తమ వద్ద ఒక పక్కా వ్యవస్థ ఉందని లోకేశ్ తెలిపారు. "యువత నుంచి వచ్చే ఆలోచనలను స్వీకరించి, వాటిని ఫాలో-అప్ చేసే విధానం మాకుంది. వారిని సంభాషణలో భాగం చేయడమే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. యువత సూచనలు, ఆలోచనలతో పాలనను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ నాయకులు కూడా తమ వైఖరిని మార్చుకోవాలని లోకేశ్ సూచించారు. "రాజకీయ నాయకులుగా మనం మన ఇగోని, అడ్డుగోడలను వదిలేయడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో యువత మీతో భావోద్వేగ స్థాయిలో మమేకమవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వారు మీ నుంచి కోరుకునేది కేవలం ప్రామాణికత మాత్రమే" అని అన్నారు. కల్మషం లేనితనం, పారదర్శకతే భారతదేశంలో తర్వాతి తరం రాజకీయ నాయకులకు ముఖ్యమైన లక్షణాలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో నవతరం రాజకీయ నాయకుల నుంచి యువత ఆశిస్తున్నది అదేనని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# జన్‌ధన్ ఖాతాలు 59 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 28న ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. దీని కింద ఈ పుష్కర కాలంలో దేశవ్యాప్తంగా 59.09 కోట్ల బ్యాంకు ఖాతాలు మొదలయ్యాయి. ఈ ఖాతాల్లో మొత్తం రూ.3,.17 లక్షల కోట్ల సొమ్ము జమయిందని ఆర్థిక శాఖ గురువారం వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీ నాటికి అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 59.09 కోట్ల జన్‌ధన్ అకౌంట్లలో 55.7 శాతం (32.92 కోట్లు) ఖాతాలు మహిళల పేరిటే ఉన్నాయి. అలాగే 77.8 శాతం (45.95 కోట్లు) ఖాతాలు గ్రామీణ, సెమీ--అర్బన్ ప్రాంతాలకు చెందినవి కావడం విశేషం. ఈ లెక్కన ప్రతి జన్‌ధన్ ఖాతాలో సగటున రూ.5,356 డిపాజిట్ ఉన్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. గత 12 ఏళ్ల కాలంలో సగటు డిపాజిట్‌లో దాదాపు మూడు రెట్ల పెరుగుదల నమోదైందని వివరించింది. ఖాతాదారులు తమ అక్కౌంట్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారనేందుకు, వారిలో పొదుపు అలవాటు పెరుగుతోందనేందుకు సగటు డిపాజిట్‌లో పెరుగుదల ఓ నిదర్శనమని ఆర్థిక శాఖ పేర్కొంది. దీనిద్వారా ఈ ఖాతాదారులు ముద్ర లోన్స్ వంటి వాటిని పొందేందుకు అర్హత సాధించారని




కూడా వెల్లడించింది.

**జీరో బ్యాలెన్స్.. ఉచిత బీమా..**

జన్‌ధన్ ఖాతాదారుల నుంచి బ్యాంకులు కనీస నగదు నిల్వ నిబంధన, నిర్వహణ చార్జీల వంటివి విధించవు. ఈ ఖాతాలతో పాటు ఉచితంగా అందించే రూపే డెబిట్ కార్డు ద్వారా ఖాతాదారులకు రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. అత్యవసర ఆర్థిక అవసరాల నిమిత్తం ఖాతాదారులు రూ.10వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ (ఓడీ) సౌకర్యాన్ని ఎలాంటి పూచీకత్తు లేకుండా వినియోగించుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఖాతాదారులకు ఇప్పటివరకు 41.29 కోట్ల రూపే డెబిట్ కార్డులను ప్రభుత్వం జారీ చేసింది. అసంఘటిత రంగ కార్ి?మికులకు ఉద్దేశించిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) తదితర బీమా, పెన్షన్ పథకాలు ప్రధానంగా ఈ ఖాతాల ద్వారానే అమలవుతున్నాయి. జన్‌ధన్, ఆధార్, మొబైల్ (జామ్) అనుసంధానం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమవుతోంది. దీనివల్ల దళారుల ప్రమేయం, జాప్యానికి అడ్డుకట్ట పడింది.

# టూరిజం హబ్‌గా 'మీరాలం'

(మొదటి పేజీ తరువాయి)

మీరాలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచాలన్నారు. చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని, ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్, ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని సీఎం చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు. సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మీరాలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

# 290మంది భారతీయుల ఆచూకీ గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు, వరదల నుంచి సురక్షితంగా బయటపడిన కొంతమంది భారతీయుల జాబితాను కూడా ఎంఈఏ విడుదల చేసింది. ఈ జల ప్రళయంతో రసువా, నువాకోట్ జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నేపాల్ పోలీసుల సమాచారం ప్రకారం, నిన్న మధ్యాహ్నం నాటికి మొత్తం 644 మంది గల్లంతయ్యారు. వీరిలో 517 మంది విదేశీయులు కాగా, 127 మంది నేపాల్ స్థానిక పౌరులు ఉన్నారు. భారతీయులతో పాటు ఇతర దేశస్థులు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతయ్యారు. బుధవారం నాటి వరదల తర్వాత నేపాల్‌లో సుమారు 100 మంది చైనా జాతీయుల ఆచూకీ తెలియడం లేదని చైనా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో 90 మంది అమెరికన్ పౌరులు చిక్కుకుని ఉండవచ్చని, వారిలో ముగ్గురిని సురక్షితంగా కాపాడామని యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. ఇప్పటివరకు ఏ అమెరికన్ పౌరుడు మరణించినట్లు తమకు సమాచారం లేదని పేర్కొంది. గల్లంతైన వారిలో 53 మంది ఉక్రేనియన్లు, 51 మంది మలేషియన్లు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 33 మంది బ్రిటన్ వాసులు, 25 మంది కెనడియన్లతో పాటు పలు దేశాల పౌరులు ఉన్నారు. నేపాల్‌లోని వరద ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బురద, శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించడానికి, వరదల్లో కొట్టుకుపోయిన వారి కోసం అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇప్పటివరకు వరదల్లో కొట్టుకుపోయిన 389 మంది మృతదేహాలను వెలికితీసినట్లు పోలీసులు తెలిపారు. అత్యధికంగా చిత్వాన్‌లో 137, నవల్‌పరాసి ఈస్ట్‌లో 87, ధాదింగ్‌లో 33 మృతదేహాలను గుర్తించారు.

# విద్యార్థులేమైనా టెర్రరిస్టులా?

వరంగల్: విద్యార్థులు ఏమైనా టెర్రరిస్టులా? తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ పిల్లల గొంతు నొక్కుతారా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో



విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వరంగల్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న తనను పోలీసులు అరెస్ట్ చేయడంపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హనుమకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ తమ భవిష్యత్తును కాపాడాలని విద్యార్థులు ఆందోళన చేస్తుంటే వారిపై కేసులు, భౌతిక దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం తప్పెలా అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులు మూడేళ్లకు రూ.15 వేలలోపే ఫీజుతో చదువుతున్నారని, భవిష్యత్తులో ఫీజులు పెరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. ఏపీలో పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని, ఢిల్లీలోనూ ఇలాంటి విధానం విఫలమైందని హరీశ్‌రావు పేర్కొన్నారు. అక్కడ తప్పని తేలిన విధానాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. 'ఏపీ, ఢిల్లీ తరహాలో జీవో 97ను వెనక్కి తీసుకోవాలి'అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టులు, కేసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. జీవో 97 రద్దు చేయకపోతే విద్యార్థులు, యువత మరింత పెద్ద ఎత్తున ఉద్యమించే పరిస్థితి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు సమస్యలపై ఆందోళనలు చేస్తున్నారని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇక్కడికి వచ్చి ఎందుకు మాట్లాడటం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'ఢిల్లీకో నీతి.. తెలంగాణకో నీతా?'అంటూ విమర్శించారు.

**టీఎన్జీఓలకు మద్దతు..**

హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీఓలు చే పట్టిన ధర్నా, ఆందోళన కార్యక్రమంలో కూడా హరీశ్‌రావు పాల్గొన్నారు. ధర్నా శిబి రానికి చేరుకుని ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన ఆయన వారి న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ పక్షాన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అధికారంలోకి వచ్చి మూ డేళ్లు దగ్గరపడుతున్నా.. ఇప్పటివరకు సీపీఎస్ రద్దు లేదు, పీఆర్సీకి మోక్షం లేదని అ న్నారు. 'దేశంలో ఆరు డీఏలు పెండింగ్‌లో పెట్టిన ఘనత మీ సర్కారుదే. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పట్టవు. రైతుల సమస్యలు పట్టవు. రేవంత్‌రెడ్డి.. మీరు సర్కారు నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?'అని ప్రశ్నించారు.'ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును కూడా కాలరాస్తున్నారు.ఈ దౌర్జన్యాలకు ఏదో ఒక రోజు తగిన మూ ల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ప్రజలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉంది'అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్ హెచ్చరించారు.

# మరో ఘోరం

అడ్డరోడ్డు సెంటర్ నుంచి వేలూరు వెళ్లేందుకు ఆటో మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి చెన్నై వెళు న్న వరుణ్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. బస్సు బలంగా ఢీకొట్టడంతో ఆటోలోనివారు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుల్లో చవుటుపల్లి లక్ష్మమ్మ(75), ఆమె కోడలు సువార్త(45), కుమార్తె బొంతా గంగమ్మ(50), భార్యాభర్తలు బొంత బాబురావు(62), మణెమ్మ (55), వరుసకు అత్తా కోడళ్లు బొంత సంపూర్ణమ్మ (70), బొంత మరియమ్మ(50) ఉన్నారు. ఈ ప్రమాదంలో నలుగురు చిన్నారులు బొంత పల్లవి, తాళ్లూరి అభిరామ్, బొంత శ్యామేల్‌రాజు, బొంత దివ్య.. మరో నలుగురు చవుటుపల్లి ధనమ్మ, చవుటుపల్లి సబ్బులమ్మ, వెంకాయమ్మ, ఆటో డ్రైవర్ బొంత అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చిలకలూరిపేట, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు చనిపోవడంతో వేలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతులందరూ వ్యవసాయ కూలీలు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు.. చిలకలూరిపేట ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించారు. ప్రైవేట్ ట్రావెల్స్‌తో మాట్లాడి తగిన పరిహారం అందించేలా చూడాలని అధికారులను పుల్లారావు కోరారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం తరఫున తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీ లావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ బాధిత కుటుంబ సభ్యులను, అధికారులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద ఘటనపై చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఆటో, బస్సు డ్రైవర్లు కొంచెం జాగ్రత్త వహించినా ప్రమాదం జరిగి ఉండేది కాదని తెలుస్తోంది. అడ్డరోడ్డులో ఆటో మలుపు తిరిగే సమయంలో బస్సు ఆటోను ఢీకొట్టింది. డ్రైవర్లిద్దరూ అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ప్రమాదం జరిగేది కాదని తెలుస్తోంది. అతివేగంతో దూసుకెళ్లే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి**

చిలకలూరిపేట ఘోర రోడ్డుప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పవన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ చిలకలూరిపేట దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



## పెరిగిన ధరల భారాన్ని తగ్గించాలి

- నిత్యావసరాల ధరలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆగ్రహం
- రామన్నపేట సుభాష్ సెంటర్‌లో ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం

**తొలివెలుగు, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని వెంటనే తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు జల్లెల్ల పెంటయ్య డిమాండ్ చేశారు. గురువారం రామన్నపేటలో నిర్వహించిన మండల కమిటీ సమావేశం అనంతరం సుభాష్ సెంటర్‌లో కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంటనూనెలు, పప్పులు, బియ్యం, పిండి, కూరగాయల ధరలు నిరంతరం పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింటోందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పేదలకు సబ్సిడీపై నిత్యావసరాలు అందించాలని కోరారు. మార్కెట్‌లో కృత్రిమ కొరతను అరికట్టడానికి ప్రభుత్వ నిల్వలను వినియోగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కందుల హనుమంతు, మేడిముకుంద, అవనగంటి నగేష్, ఉంద్రాతి నరసింహ, నాగటి లక్ష్మణ్, శానకొండ వెంకటేశ్వర్లు, ఎడ్ల ధనమ్మ, పిట్టల పద్మ, చెన్ని స్వామి, నరసింహచారి, గొరనాగటి ఉపేందర్, తాళ్లపల్లి జితేందర్, జోగుల శ్రీనివాస్, కొమ్ము నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుల అభివృద్ధికి బిగ్ ప్లాన్

- రూ.9 కోట్లతో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు
- 80 ఎలక్ట్రానిక్ కాంటాల కొనుగోలుకు శ్రీకారం



**తొలివెలుగు, రామన్నపేట :** వలిగొండ, రామన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి పాలకవర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గురువారం వలిగొండ ఏఎంసీ కార్యాలయంలో ఛైర్మన్ భుక్య భీమా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో రూ.9 కోట్ల వ్యయంతో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తీర్మానించారు. వలిగొండ యార్డులో 2,500 మెట్రిక్ టన్నులు, రామన్నపేట యార్డులో 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ గోదాములను నిర్మించనున్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా ధాన్యం తూకాల్లో పారదర్శకత కోసం 80 కొత్త ఎలక్ట్రానిక్ కాంటాలను కొనుగోలు చేయడానికి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. అలాగే నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం సిఫారసు మేరకు రామన్నపేట మార్కెట్ యార్డును నూతన మార్కెట్ కమిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని మార్కెటింగ్ శాఖ సంచాలకులకు లేఖ రాయాలని తీర్మానించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గుండు దానయ్య, పెద్దగొని వెంకటేశం, కర్నాటి లింగస్వామి, ఉక్కుర్తి చంద్రయ్య, రాచమల్లు తిరుపతయ్య, జూకంటి శివమ్మ, దిండిగాళ్ల సత్తయ్య, గగ్గినేపల్లి నరేందర్‌రెడ్డి, కుంబం వెంకట్, పాపిరెడ్డి, సర్పంచ్ తదితరులు, వలిగొండ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి
- ఓటర్ల జాబితా సవరణ గ్రామసభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**తొలివెలుగు, రాజాపేట :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా గురువారం మండలంలోని దూది వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. బూత్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఓటర్ల జాబితాను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాబితాను తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ గోలి రవికిరణ్, పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్‌గౌడ్, సర్పంచ్ నడిమింటి నరేష్, ఉపసర్పంచ్ ఏసు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గాంధీ, అధికారులు, బూత్ స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాఖీ పండుగ.. చెల్లెలే మహాలక్ష్మి!



- అన్నాచెల్లెళ్ల అపురూప అనుబంధానికి ప్రతీక
- ఆడపిల్ల ఉంటేనే రాఖీ పండుగకు అసలైన అందం
- రక్షణతో పాటు విద్య, భవిష్యత్తుకు అండగా నిలవాలి
- ప్రతి చెల్లెలి కలను సాకారం చేయడమే నిజమైన రాఖీ కానుక

అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అపురూపమైన ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకుంటున్నారు. రాఖీ అంటే కేవలం చేతికి రంగురంగుల దారం కట్టే సంప్రదాయం మాత్రమే కాదు.. కుటుంబంలోని ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, విశ్వాసానికి ప్రతీక. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య విడదీయరాని బంధాన్ని చాటుతోంది. చెల్లెలు తన అన్న చేతికి రాఖీ కడుతూ ఎల్లప్పుడూ తనపై ప్రేమ, ఆదరణ, రక్షణ ఉండాలని కోరుకుంటుంది. అదే సమయంలో అన్న.. తన చెల్లెలి ఆనందం, భద్రత, భవిష్యత్తు కోసం అండగా నిలుస్తానని మాట ఇస్తాడు. అందుకే రాఖీ అంటే ప్రేమ.. రాఖీ అంటే రక్షణ.. రాఖీ అంటే బాధ్యత.. అనే భావన భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రత్యేక స్థానాన్ని పొందింది.

**తొలివెలుగు, రామన్నపేట**

### నిజమైన రాఖీ కానుక అంటే..

- చెల్లెలికి కుటుంబ ఆస్తిలో సమాన హక్కు కల్పించడం
- ఆమె ఉన్నత చదువుకు పూర్తి సహకారం అందించడం
- బాల్య వివాహాలను అరికట్టడం
- ఆడపిల్లలు స్వయం సమర్థులుగా ఎదిగేలా ప్రోత్సహించడం
- వేధింపులు, వివక్ష ఎదురైనప్పుడు అండగా నిలవడం
- ప్రతి ఆడపిల్లకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం

**భారత సంస్కృతిలో రాఖీ విశిష్టత:**
రాఖీ పండుగకు పురాణ, చారిత్రక నేపథ్యం కూడా ఉందని చెబుతారు. ద్రౌపది శ్రీకృష్ణుడికి రాఖీ కట్టగా, ఆమెపై తనకు ఉన్న బాధ్యతను గుర్తించిన శ్రీకృష్ణుడు కష్టకాలంలో ద్రౌపదిని రక్షించాడనే విశ్వాసం ఉంది. అలాగే చరిత్రలో రాణి కర్ణావతి హుమాయూన్‌కు రాఖీ పంపి సహాయం కోరిన ఘటన కూడా అన్నాచెల్లెళ్ల బంధంలోని విశ్వాసాన్ని చాటుతుందని పేర్కొంటారు.

**ఈ తరం రాఖీకి కొత్త అర్థం:**
కాలం మారుతోంది.. ఆలోచనలు మారుతున్నాయి.. రాఖీ బంధానికి కూడా కొత్త అర్థం వస్తోంది. గతంలో చెల్లెలు తన రక్షణ కోసం అన్నపై ఆధారపడే భావన ఎక్కువగా ఉండేది. అయితే నేటి ఆడపిల్ల తన రక్షణతో పాటు తన కలలకు, చదువుకు, ఆశయాలకు కుటుంబం నుంచి అండదండలు కోరుకుంటోంది.



**"అన్నా.. నన్ను కాపాడు" అని మాత్రమే కాదు..**
"అన్నా.. నా చదువుకు, నా కలలకు అండగా ఉండు" అని నేటి చెల్లెలు కోరుకుంటోంది.
నేటి ఆడపిల్లలు విద్య, వైద్యం, పరిపాలన, విజ్ఞానశాస్త్రం, జర్నలిజం, వ్యాపారం, క్రీడలు సహా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. పైలట్లుగా, కలెక్టర్లుగా, వైద్యులుగా, జర్నలిస్టులుగా, వ్యాపారవేత్తలుగా ఎదుగుతూ కుటుంబానికి, సమాజానికి గర్వకారణంగా నిలుస్తున్నారు.

**ఆడపిల్ల ఉంటేనే రాఖీకి అందం:**
ఇంట్లో చెల్లెలు ఉంటే రాఖీ పండుగకు ప్రత్యేకమైన సందడి ఉంటుంది. అన్న చేతికి రాఖీ కడుతూ ఆమె చూపించే ప్రేమ, ఆప్యాయత కుటుంబంలో ఆనందాన్ని నింపుతుంది. అందుకే "ఆడపిల్ల ఉంటేనే రాఖీకి అందం.. చెల్లెలే ఇంటి మహాలక్ష్మి" అనే భావనను ప్రతి కుటుంబం గౌరవించాల్సిన అవసరం ఉంది.
ఆడపిల్ల పుట్టడాన్ని భారంగా కాకుండా వరంగా భావించాలి. ఆమెను ప్రేమగా పెంచుతూ, మంచి విద్యను అందిస్తూ, స్వయం సమర్థురాలిగా తీర్చిదిద్దాలి. ప్రతి కుటుంబంలో ఆడపిల్లకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది.

**నిజమైన రాఖీ కానుక ఏది..?**
రాఖీ రోజున చెల్లెలికి డబ్బులు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వడం మాత్రమే అన్న బాధ్యత కాదని సామాజికవేత్తలు పేర్కొంటున్నారు. చెల్లెలి జీవితానికి నిజమైన భరోసా ఇవ్వడమే అసలైన రాఖీ కానుక.

**రాఖీ సందర్భంగా ఒక ప్రతిజ్ఞ:**
"మా ఇంటి ఆడపిల్లను గౌరవంగా, ప్రేమగా చూసుకుంటాం..
మా చెల్లెలి కలలకు అండగా నిలుస్తాం..
ఆమె విద్య, భవిష్యత్తు, భద్రత కోసం ఎల్లప్పుడూ సహకరిస్తాం..

### ఆడపిల్లను గౌరవిద్దాం..

ప్రతి చెల్లెలి చిరునవ్వును కాపాడుకుందాం.."
రాఖీ పండుగ కేవలం ఒక రోజు జరిగే వేడుకగా కాకుండా ఆడపిల్లల పట్ల గౌరవం, వారి విద్యాభివృద్ధికి సహకారం, భద్రతకు బాధ్యత వహించే సామాజిక సంకల్పంగా మారాలి. ప్రతి చెల్లెలికి రక్షణ మాత్రమే కాదు.. ఆమె ఆశయాలకు ఆకాశం ఇవ్వాలి.

**చెల్లెలి చేతికి బలం ఇచ్చే అన్న..**
ఆమె కలలకు రెక్కలు ఇచ్చే కుటుంబం..
ఆమె భవిష్యత్తుకు భరోసా ఇచ్చే సమాజం..
ఇదే నిజమైన రాఖీ సందేశం. ఇదే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి అసలైన అర్థం. రాఖీ దారానికి నిజమైన విలువ కూడా అదే.

**కె.వి. సుధాకర్ రాజు, రామన్నపేట**

# తల్లి లాంటి చెరువును మింగేస్తున్నారు..?

- దొంగతనాన్ని అడ్డుకోకపోతే అధోగతేనంటూ ఆందోళన
- రియల్ వ్యాపారుల అకృత్యాలపై సంతకాల సేకరణ
- మల్లాయి చెరువు పరిరక్షణకు రైతులు, గ్రామస్తుల పోరాటం

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని మల్లాయి చెరువు రియల్ వ్యాపారుల కబ్జాకు గురవుతోందంటూ రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కన్నతల్లి లాంటి చెరువును మింగేసేందుకు కొందరు బడా వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చెరువు మధ్యలోనే ఏకంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని విమర్శిస్తున్నారు. చెరువులో జరుగుతున్న పనులను ప్రశ్నించిన రైతులు, గ్రామస్తులకు సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొంతనలేని సమాధానాలు చెబుతూ పనులను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ కబ్జా ప్రయత్నాలను అడ్డుకోకపోతే భవిష్యత్ తరాలు తమను చీత్కరించుకునే పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సర్వే నంబర్లు 223, 224లో కబ్జా ఆరోపణలు:**
సర్వే నంబర్లు 223, 224లో ఉన్న చెరువు స్థలం, శిఖం, ముంపు ప్రాంతాలను ఆక్రమిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. బహిరంగంగానే పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. సుమారు 25 రోజులుగా పనులు కొనసాగుతున్నా చర్యలు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




**సంతకాల సేకరణకు శ్రీకారం:**
చెరువును పరిరక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చల్లూరు రైతులు, గ్రామస్తులు సంతకాల సేకరణ ప్రారంభించారు. చెరువు కబ్జాపై న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. దోషులు ఎవరైనా వారిని వదిలిపెట్టొద్దని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో అధికారులకు చెరువు కబ్జాపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరిస్తున్నట్లు వివరించారు. రియల్ వ్యాపారుల అకృత్యాలకు అధికారులు తలొగ్గకుండా, రైతులు, గ్రామస్తులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు అండగా నిలవాలని వారు డిమాండ్ చేశారు. "చెరువును కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమే. న్యాయం జరిగే వరకు మడమ తిప్పం" అని గ్రామస్తులు హెచ్చరించారు.





## ఓటరు జాబితాలో మీ పేరు సరి చూసుకోండి!

- నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక అవకాశం
- నిడమనూరు తహశీల్దార్ జంగాల కృష్ణయ్య వెల్లడి

**తొలివెలుగు, నిడమనూరు :** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జంగాల కృష్ణయ్య సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026)పై గ్రామసభలు నిర్వహించారు. నిడమనూరు గ్రామసభలో పాల్గొన్న తహశీల్దార్ డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువతీ యువకులు ఫారం-6 ద్వారా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేరు, చిరునామా మార్పులు, ఇతర సవరణలకు ఫారం-8, జాబితాలో పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం-7 ఉపయోగించాలని వివరించారు. ప్రజలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్, ఎంఆర్ఐలు సైదులు, ఎన్ఆర్ఐ ఆఫీసర్, సూపర్‌వైజర్లు బి. ఆంజనేయులు, జె. ఈశ్వర్, బి. సైదులు, మోహన్‌కృష్ణ, బీఎల్‌వోలు బారెడ్డి అనూషారెడ్డి, లింగం, ఝాన్సీ, ఇతర బీఎల్‌వోలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఓటర్లు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- బాధితుడికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ప్రజా ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని కనుముక్కల గ్రామానికి చెందిన చుక్క కృష్ణ శస్త్రచికిత్స నిమిత్తం మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని గురువారం బాధితుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్న నియోజకవర్గ ప్రజలకు వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనుముక్కల గ్రామ సర్పంచ్ చుక్క శోభా శంకర్, బీసీ జిల్లా నాయకులు పాక రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు చుక్క చైతన్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌వైఏ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా కీర్తి సంజీవ



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** పురపాలక కేంద్రంలోని నేతాజీ యువజన సమైక్య (ఎన్‌వైఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి పంచరాత్రోత్సవాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కీర్తి సంజీవను ఎంపిక చేశారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు మక్తాల వెంకటేష్ ఆయనను ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా కీర్తి సంజీవ మాట్లాడుతూ.. రానున్న వినాయక చవితి పంచరాత్రోత్సవాలను శోభాయమానంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి యువజన సమైక్య సభ్యులు, భక్తులు సహకరించాలని కోరారు.

## నిర్దేశిత గడువులోపు పత్రాలు సమర్పించాలి: తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి


- నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్లకు సూచన
- పోచంపల్లి మున్సిపాలిటీలో వార్డు సభల నిర్వహణ

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు తమకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్న నిర్దేశిత గడువులోపు గుర్తింపు, సంబంధిత ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించాలని తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం కూరపాలెం కేంద్రంలోని వినోద్ మందిర్ వద్ద పోచంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలో 'ఎస్ఐఆర్' ప్రక్రియలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హాజరై, నో మ్యాపింగ్ జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లను అధికారులు వార్డు సభలో చదివి వినిపించారు. పట్టణ, మండల వ్యాప్తంగా సుమారు 10,015 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లను గుర్తించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ నెల 31లోపు సంబంధిత ఓటర్లందరికీ బీఎల్‌వోలు నోటీసులు జారీ చేస్తారని చెప్పారు. అవసరమైన పత్రాలను సమర్పించేందుకు సెప్టెంబర్ 19వ తేదీ వరకు గడువు నిర్ణయించినట్లు వెల్లడించారు. నిర్దేశిత గడువులోపు అవసరమైన పత్రాలను సమర్పించకపోతే ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, బత్క లింగస్వామి యాదవ్, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, దేవరాయ కుమార్, సురపల్లి రాధిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కోతుల కల్లోలం.. జన్నారం మండలంలో బెంబేలెత్తుతున్న ప్రజలు

- ఇళ్లపై పడి విధ్వంసం
- ఎదురుదాడులతో గాయాలు
- గ్రామాలు, పట్టణాల్లో దాడులు




**తొలివెలుగు, జన్నారం :** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా జనావాసాల్లోకి చొరబడుతున్న వానరాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కోతుల కల్లోలంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇళ్లలోకి చొరబడి విధ్వంసం..!**

కోతుల గుంపులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. వంటగదుల్లోకి ప్రవేశించి నిత్యావసర సరుకులను చిందరవందర చేయడంతో పాటు ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఇళ్ల తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.

**పంటలు, పండ్ల తోటలపై దాడులు:**

జనావాసాలకే పరిమితం కాకుండా కోతుల గుంపులు పంట పొలాలు, పండ్ల తోటలపై కూడా దాడులు చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.

**తరిమితే ఎదురుదాడులు..!**

కోతులను తరిమేందుకు ప్రయత్నించిన సమయంలో అవి ఎదురుదాడులకు దిగుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో కోతుల దాడులతో ప్రజలు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అడవుల్లో ఆహారం తగ్గడమే కారణమా..?**

అడవుల్లో ఆహారం, నీటి వనరులు తగ్గిపోవడం, అడవుల విస్తీర్ణం తగ్గడం వంటి కారణాలతో వానరాలు జనావాసాల వైపు వస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న కోతుల బెడదతో సాధారణ జీవనం అస్తవ్యస్తంగా మారుతోందని వాపోతున్నారు. జన్నారం మండలంలో వానరాల బెడదను నియంత్రించేందుకు అటవీ, సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా అలివేలు

- వైభవంగా చౌటుప్పల్ మండల మహిళా సమాఖ్య ఎన్నికలు
- కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా సుమలత ఎంపిక

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లా డిపిఎం (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) కట్ట వెంకటేశం ఎన్నికల అధికారిగా వ్యవహరించి పర్యవేక్షించారు. మండల పరిధిలోని అన్ని సంఘ బంధాల అధ్యక్షుల సమక్షంలో ముందుగా కార్యనిర్వాహక కమిటీ



(ఈసీ)ని, అనంతరం ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా కైతాపురం సంఘ బంధానికి చెందిన కొలుకులపల్లి అలివేలు, కార్యదర్శిగా చిన్న కొండూరు సంఘ బంధానికి చెందిన తీగుళ్ల రమణ, కోశాధికారిగా ఎలగిరి సంఘ బంధానికి చెందిన శాఘ సుమలత ఎన్నికయ్యారు. మహిళల ఆర్థిక పురోగతికి, సమాఖ్య బలోపేతానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఊరిపక్క యాదయ్య, సీసీలు విమల, నరసింహ, కల్పన, అకౌంటెంట్ ఇందిర, కంప్యూటర్ ఆపరేటర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన అదనపు ఎస్పీ

- రికార్డులు, కేసుల పురోగతిపై సమీక్ష
- శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలి: లక్ష్మీనారాయణ




**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, నమోదైన కేసుల పురోగతిపై సీఐ సతీష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో డీఐజీ పర్యటన నేపథ్యంలో ముందస్తుగా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి కేసులకు సంబంధించిన రికార్డులు, ఇతర ఏర్పాట్లను పరిశీలించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ జగన్, ఎస్ఐ లైలా, రైటర్ వెంకన్న, ఏఎస్ఐ మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

- ఆచూకీ కోసం వనస్థలిపురం పోలీసుల ప్రకటన
- సమాచారం అందించాలని విజ్ఞప్తి



**తొలివెలుగు, వనస్థలిపురం :** స్పృహతప్పి పడిపోయి ఆశ్రమంలో సంరక్షణ పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు గల ఓ వ్యక్తి ఈ నెల 21న రాత్రి 11 గంటల సమయంలో ఆటోనగర్‌లోని ఏఆర్‌సీ సమీపంలో రోడ్డుపై స్పృహతప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అతడిని వనస్థలిపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన అనంతరం 'ఆలేటి ఆశ్రమం'లో చేర్పించారు. ఆశ్రమంలో ఉన్న సదరు వ్యక్తి ఈ నెల 25న ఉదయం 7 గంటల సమయంలో మృతి చెందినట్లు నిర్వాహకులు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు లేదా అతడిని గుర్తించిన వారు 8712662300, 8712662637, 8712662280 నంబర్లలో సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ఫేస్‌బుక్ ఫ్రెండ్ పేరిట రూ.93 వేలకు టోకరా!

- నకిలీ ఖాతాతో సైబర్ కేటుగాడి మోసం
- బాధితుడి ఫిర్యాదుతో ఎల్‌బీనగర్‌లో కేసు

**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** స్నేహితుడి పేరుతో సోషల్ మీడియాలో నకిలీ ఖాతా సృష్టించి ఓ వ్యక్తిని నమ్మించి రూ. 93 వేలు కాజేసిన సైబర్ మోసం ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎండీ తౌసిఫ్ ఆలం (31) టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న 'ఇర్షాద్ అహ్మద్' పేరుతో ఉన్న మెసెంజర్ ఖాతా నుంచి అతడికి సందేశం వచ్చింది. ఆ ఖాతాలో తన స్నేహితుడు ఇర్షాద్ అహ్మద్ ఫొటో ఉండటంతో నిజమైన స్నేహితుడే సందేశం పంపుతున్నాడని తౌసిఫ్ నమ్మాడు. అవతలి వ్యక్తి తాను ఖతార్‌లో ఉన్నానని, నెల రోజుల్లో భారత్‌కు వస్తానని తెలిపాడు. తన బ్యాంకు ఖాతా నుంచి రూ. 5 లక్షలు పంపిస్తున్నానని, భారత్‌కు వచ్చిన తర్వాత తిరిగి తీసుకుంటానని నమ్మించాడు. అనంతరం రూ. 5.94 లక్షలు బదిలీ చేసినట్లు ఓ పేమెంట్ స్లిప్‌ను పంపి, ఆ డబ్బు ఖాతాలో జమ కావడానికి నెల రోజుల సమయం పడుతుందని చెప్పాడు. అదే రోజు అత్యవసరంగా ఇమ్మిగ్రేషన్ కోసం డబ్బు అవసరమని, చెల్లించకపోతే వీసా రద్దవుతుందని చెప్పి రూ. 1.70 లక్షలు ఏజెంట్‌కు పంపించాలని కోరాడు. ఇందుకోసం ఓ ఫోన్ నంబర్ ఇచ్చి వాట్సాప్‌లో సంప్రదించాలని సూచించాడు. ఆ నంబర్‌ను సంప్రదించగా క్యూఆర్ కోడ్‌లు, పేమెంట్ స్కానర్లు పంపారు. వాటిని నమ్మిన తౌసిఫ్ పలు దఫాలుగా మొత్తం రూ. 93 వేలు బదిలీ చేశాడు. అయితే 24 గంటలు గడిచినా తన ఖాతాలో రూ. 5.94 లక్షలు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన తౌసిఫ్.. అసలు స్నేహితుడు ఇర్షాద్‌ను ఫోన్‌లో సంప్రదించాడు. తాను ఎలాంటి సందేశాలు పంపలేదని, డబ్బు అడగలేదని ఇర్షాద్ చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాడు. తన స్నేహితుడి పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతా సృష్టించి గుర్తుతెలియని వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని పేర్కొంటూ తౌసిఫ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు




- వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ
- హాజరైన మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి

**తొలివెలుగు, ఎ.ఎస్.రావు నగర్ :** నేత్రదానం ద్వారా దృష్టి కోల్పోయిన వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఎ.ఎస్.రావు నగర్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి అన్నారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఎ.ఎస్.రావు నగర్‌లోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వద్ద నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పజ్జూరి పావని రెడ్డి మాట్లాడుతూ.. 'ఐ డొనేషన్ ఫోర్ట్‌నైట్' కార్యక్రమంలో భాగంగా వాసన్ ఐ కేర్ నిర్వహిస్తున్న నేత్రదాన అవగాహన కార్యక్రమాలను అభినందించారు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అనే మాటను ఉటంకిస్తూ కంటి చూపు మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైనదని పేర్కొన్నారు. నేత్రదానం ద్వారా దృష్టి లేని వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుని స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాము మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా నేత్రదానంపై అవగాహన కల్పించాలని సూచించారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ సంకేత్ మాట్లాడుతూ నేత్రదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రజలు సంకల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమేష్ జి, అంజుమ్, ప్రసాద్, అరవింద్ కుమార్‌తో పాటు వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, నేత్రదాన ఉద్యమ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళల భద్రతకు పోలీస్ 'రక్ష'

- కొత్తపేట్ మహిళా భవన్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- సహచారీలకు రాఖీలు, బహుమతులు అందజేసిన చైతన్యపురి పోలీసులు

**తొలివెలుగు, కొత్తపేట్ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చైతన్యపురి పోలీసుల ఆధ్వర్యంలో కొత్తపేట్ మహిళా భవనంలో 'సహచారీ'ల కోసం గురువారం ప్రత్యేక రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది సహచారీలతో కలిసి ఆప్యాయంగా వేడుకల్లో పాల్గొని సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం వారికి స్వీట్లు, ప్రత్యేక బహుమతులు అందజేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన రక్షాబంధన్ సందేశాన్ని పోలీసులు ఈ సందర్భంగా చదివి వినిపించారు. మహిళల పట్ల గౌరవం, భద్రత, ఆత్మీయత, పరస్పర నమ్మకాన్ని పెంపొందించడంతో పాటు పోలీసులకు-ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చైతన్యపురి పోలీసులు తెలిపారు. తమతో సోదరభావంతో వేడుకలు జరిపిన హైదరాబాద్ సీపీకి, చైతన్యపురి పోలీసులకు సహచారీలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ మహిళల సాధికారత, భద్రతకు కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# పేరిణి నృత్యంతో ముగ్ధులను చేసిన రేణుశ్రీ

- స్వామివారి వేషధారణలో ఆహూతులను మైమరిపించిన చిన్నారి
- సంతోషిమాత గురు స్థాన ఉత్సవాల్లో కన్నులపండువగా సాంస్కృతిక వేడుకలు
- శ్రీవెంకటేశ్వర స్వామి వేషధారణకు దక్కిన ప్రశంసలు



**తొలివెలుగు, ఆలేరు :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని శ్రీ సంతోషిమాత గురు స్థాన 44వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కన్నులపండువగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పేరిణి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జనగామకు చెందిన శ్రీ చంద్రకళ నిలయం నాట్యాచార్యులు పెరమాండ్ల సంతోష్ మాస్టర్ శిష్య బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. నృత్య రూపకంలో రాజాపేటకు చెందిన సామల సురేష్--వాణి దంపతుల కుమార్తె సామల రేణుశ్రీ శ్రీవెంకటేశ్వర స్వామి వేషధారణలో పేరిణి నృత్యాన్ని ప్రదర్శించి ఆహూతులను మైమరిపించింది. స్వామివారి వేషధారణకు తగ్గట్టుగా చిన్నారి రేణుశ్రీ చేసిన అభినయం, నృత్య విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఆమె ప్రదర్శనను తిలకించిన పలువురు ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారిని అభినందించారు. ఈ సందర్భంగా తనకు అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రేణుశ్రీ ధన్యవాదాలు తెలిపింది. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, యెంగల్‌దాస్ వెంకటేశం, స్రవంతి, ఉదయ్‌కుమార్, యాదగిరి, రమ్య, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- కుర్రారం గ్రామానికి చెందిన గజం శ్రీనివాసు కుటుంబానికి రూ.5 వేల అందజేత

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన గజం శ్రీనివాసు అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి కుర్రారం గ్రామ సర్పంచ్ బొడ్డు భాస్కర్ గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రావి కొండల్‌రెడ్డి, పాల సొసైటీ చైర్మన్ పెట్టపర్తి రాజిరెడ్డి, కోఆపరేటివ్ మాజీ డైరెక్టర్ కత్తుల అంజిరెడ్డి, గజం చంద్రయ్య, గజం భాస్కర్, గజం జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



# అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్






- నమిల ప్రాథమిక పాఠశాలలో వేడుకలు
- ప్రధానోపాధ్యాయుడు నమిల భరత్ కుమార్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం నమిల ప్రాథమిక పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నమిల భరత్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. రక్షాబంధన్66 ప్రేమ, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆప్యాయత, అనుబంధాన్ని గుర్తుచేసే పవిత్రమైన పండుగ రాఖీ అని పేర్కొన్నారు. సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మిఠాయిలు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కుటుంబ బంధాల విలువను తెలియజేసే రక్షాబంధన్ పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కందుల మమత, మంత్రి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



# నవజీవన్‌రెడ్డికి బీజేపీ నాయకుల జన్మదిన శుభాకాంక్షలు




- శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసిన జీఎస్ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి

**తొలివెలుగు, హయత్‌నగర్ :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు కళ్లెం నవజీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జీఎస్ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి గురువారం ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వినోద్‌రెడ్డి ఆకాంక్షించారు. హయత్‌నగర్ ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నవజీవన్‌రెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంజీవ్‌రెడ్డి, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, రాందయాకర్‌రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, వెంకటేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కళ్లెం నవజీవన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రేమానురాగాల 'రక్ష'.. గ్రీన్ గ్రోవ్‌లో వేడుకలు

- ఒకరోజు ముందుగానే కన్నులపండువగా రాఖీ పౌర్ణమి
- సిబ్బంది, డ్రైవర్లకు రాఖీలు కట్టి ఆత్మీయత చాటుకున్న పిల్లలు
- పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్‌లోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఒకరోజు ముందుగానే గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు ఎంతో ఆనందోత్సాహాలతో పరస్పరం రాఖీలు కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్నారు. పాఠశాల డ్రైవర్లు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి కూడా చిన్నారులు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను, కృతజ్ఞతలను వ్యక్తపరిచారు. రాఖీ పండుగ కేవలం ఒక దారం మాత్రమే కాదని, ప్రేమ, నమ్మకం, బాధ్యతలను కలిపే పవిత్ర బంధమని ఈ సందర్భంగా నిర్వహకులు పేర్కొన్నారు. పిల్లల్లో సంస్కారాలు, సేవాభావాన్ని పెంపొందించేలా ఈ వేడుక సాగింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి, డైరెక్టర్ సాధిపల్లి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# మున్సిపల్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష కౌన్సిలర్ల ధర్నా

- రికార్డులు వెల్లడించలేదని కౌన్సిల్ సమావేశం బహిష్కరణ
- రూ.40 లక్షల నిధుల వ్యయంపై పారదర్శకత ఏది?
- నల్లా పన్ను ప్రత్యేక వసూలు నిలిపివేయాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ అఖిలపక్ష వార్డు కౌన్సిలర్లు చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసనకు దిగారు. కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి ధర్నా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మినిట్ బుక్, ఎంపీ రికార్డుతో పాటు తొలి కౌన్సిల్ సమావేశ తీర్మానాలను చూపించకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు అడిగిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం సరికాదని మండిపడ్డారు. కార్యాలయ మరమ్మతుల పేరుతో విడతల వారీగా ఖర్చు చేసినట్లు చెబుతున్న రూ.40 లక్షల నిధుల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, భాజపా ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా విధిస్తున్న ఇంటి నల్లా పన్ను వసూలును తక్షణమే నిలిపివేయాలన్నారు. మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన పదేళ్లుగా లేని పన్నును ఇప్పుడు వసూలు చేయడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని, దీనిపై కౌన్సిల్‌లో ప్రత్యేక తీర్మానం చేయాలని కోరారు. ఈ ఆందోళనలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును పరిరక్షించుకోవాలి

- తిరస్కరించిన దరఖాస్తులను బీఎల్వోలతో కలిసి ఓటర్లకు అందజేత
- సకాలంలో అధికారులను కలిసి వివరణ ఇవ్వాలని సూచన
- చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ



**తొలివెలుగు, చిట్యాల :** ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ కోరారు. వివిధ కారణాలతో తిరస్కరణకు గురైన ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను గురువారం బీఎల్వోలతో కలిసి ఆయన సంబంధిత ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎద్దులపురి కృష్ణ మాట్లాడుతూ.. దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి తగిన వివరణలు, అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తిమంతమైన ఆయుధమని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులపై ఉందన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా, నిర్ణీత గడువులోపు అధికారులను సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, మున్సిపల్ కమిషనర్ గురులింగం, కౌన్సిలర్ బొబ్బలి సందీప్‌రామిరెడ్డి, నాయకులు గాలి లింగయ్య, సిలువేరు శేఖర్, చోల్లేటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పెన్షనర్లకు ఆరోగ్య భద్రత ఏది?!

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల సాధనకు ఈనెల 7 తేదీ ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించడానికి ఆ సంఘం నిర్ణయించింది. ఈ మేరకు సంఘం కార్యవర్గం సోమవారం సమావేశమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర నేతలు సమావేశమై నిర్ణయించారు. సుదీర్ఘకాలం సేవలు అందించి, రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భద్రతను ఇచ్చే ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ (ఈహెచ్ఎస్) సంక్షోభంలో పడింది. గత నెల 15న ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులకు కూడా డిజిటల్ హెల్త్ కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్ చివరకు నిరాశే మిగిల్చింది. ఇంతవరకు నెట్‌వర్క్ దవాఖానలతో ఒప్పందాలు చేసుకోలేదు. కొత్త ఎంప్లాయి హెల్త్‌కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) సేవలను ప్రభుత్వం ప్రతిపాదించిన ప్యాకేజీ ధరలతో సేవలు అందించలేమని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెచ్ఏ) తేల్చిచెప్పింది. అంతేకాకుండా ఈ కొత్త పథకం అమలుకు ముందే పాత ఈహెచ్ఎస్ పెండింగ్ బకాయిలు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు చెల్లించాలని టీఏఎన్‌హెచ్ఏ డిమాండ్ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2005 ఫిబ్రవరి 15న అప్పటి ప్రభుత్వం జీవో 74 విడుదల చేసింది. దీని ద్వారా ఉద్యోగి లేదా పెన్షనర్ తన చేతి నుంచి హాస్పిటల్‌కు చెల్లించిన లక్షల రూపాయలు రీయింబర్స్‌మెంట్ బిల్లుల ద్వారా సకాలంలో వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఒకవేళ రీయింబర్స్‌మెంట్ బిల్లు వచ్చినా అందులో సగం కట్ అయి రెండు లేదా మూడేండ్ల తర్వాత చేతికి అందేది.

# యువత భవిష్యత్తు కోసం పోరాడాలి..

జీవితంలో వైఫల్యాలు అందరికీ ఉంటాయి. పెద్దదో, చిన్నదో అవి ఎదుర్కొంటారు. కానీ ఒక అఖండ విజయాన్ని పొందినప్పుడే సంయమనం అవసరం. జంతర్ మంతర్‌లో యువ బొద్దింకలది ఒక రకంగా అఖండ విజయమే. గత 12 ఏండ్ల నుంచి వ్యవస్థలను, వార్తా మాధ్యమాలను చేజిక్కించుకుని ప్రజలతో, వారి సంక్షేమంతో సంబంధం లేకుండా పరస్పర సంబంధాలు తుడిచేసి, ఏకాంకిక (ఏకపాత్రాభినయంలా) కేంద్రం పరిపాలన చేస్తున్న సమయంలో ప్రజల వ్యతిరేకతను ఇంత బాగా చూపించిన ఘనత మన వారసులదే! అయితే పైకి ఇది 'కంస సంహారం'లాగా కనిపించినా ఇక్కడ వైరిబలం తెలుసుకోవటం చాలా ముఖ్యం. ంతర్ మంతర్ వద్ద ఉద్యమించిన కాక్రోచ్ పార్టీ ఆందోళనకారులపై పోలీసులు విరుచుకుపడ్డారు. మేకులు బిగించిన లాఠీలతో దాడి చేశారు. అక్కడ మోహరించిన బీజేపీ అనుకూల గుంపులు, గూండాలు



నిరసనకారులను చితకబాదారు. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో పెద్దఎత్తున కనిపించాయి. పశు బలంతో, భయభ్రాంతులను చేసి, ప్రజలను పీడించిన వాళ్లు దేశభక్తులా? వీరి నాయకుడు విశ్వగురువా? మణిపూర్ మారణహోమం, క్రీడాకారిణులు చేసిన నిరసన ఎట్లా ముగిసింది? ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌కు పదవులు, అధికారం, సత్కారాలా? పూర్తి ఏడాదిపాటు రోడ్ల మీదే బతికి వ్యవసాయ నల్ల చట్టాలు వద్దని నిరసన తెలిపిన అన్నదాతలను బీజేపీ ఎట్లా పీడించింది? అన్నం తినేటప్పుడైనా రైతు విలువ గుర్తురావాలి కదా! ఇవన్నీ పైకి కనిపించిన ఘటనలు. చాపకింద నీరులా దేశ సంపద సంపన్నుల వైపు ప్రవహిస్తుంటే, నిరసన తెలిపేవారి గతి రోజూ చూస్తున్నాం. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అరాచకాలను ఏ స్థాయి వరకూ తీసుకెళ్తున్నదో అర్థం చేసుకోవడానికి. అందుకే ప్రస్తుతం ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలుస్తున్న యువతకు వైరిబలం, వారి ప్రవర్తన అర్థం చేసుకోవడం చాలా అవసరం. యువత ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. ఏ ఉద్యమంలోనైనా ఒకే రకమైన ప్రణాళిక పాటించడం శ్రేయస్కరం కాదు. కష్టనష్టాలకోర్చి మొన్నటి నిరసనలాంటిది మళ్లీ చేస్తే దానిని చూడటం ప్రజలకు అలవాటయిపోతుంది ఏదైనా అలవాటయిపోయిన దాన్ని ప్రజలు పట్టించుకోరు. కాబట్టి జెన్-జీ సమయం, ధనం వెచ్చించాల్సింది కేంద్రానికి బలమున్న ఢిల్లీలో కాదు. ఎవరి రాష్ట్రంలో వారు ఆ రాష్ట్ర ప్రభుత్వ పాలనను ఎండగట్టాలి. అన్ని ఆన్‌లైన్ వేదికల మీద కూడా చర్చించుకోవచ్చు. రాష్ట్ర రాజధానులు, వివిధ నగరాల్లోనూఆందోళన కార్యక్రమాలు సాగించాలని యువతకు సూచన. ముఖ్యంగా అక్కడి సామాన్య ప్రజలను చైతన్యపర్చండి. ఇంకా ముఖ్యమైన విషయం. మీ రాష్ట్రంలో ఉన్నత విద్యావంతులు ప్రభుత్వంలో రిటైరైనవారు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, డాక్టర్లు, లాయర్లు, ఇంకెవరైనా రాజకీయ అవగాహన ఉండి, ప్రజాహితం కోరే ఒక పదిమంది పెద్దవయసు వారిని మీ గ్రూపులకు ప్రత్యేక అతిథులుగా నియమించుకోండి. ఎందుకంటే, ఏ ఉద్యమానికైనా మీకున్న శక్తి, చైతన్యం, ఉత్సాహం, ధైర్యం ఎంత ముఖ్యమో, పెద్ద వయసువారికున్న జీవితానుభవం, రాజకీయ అవగాహన, పూర్వచరిత్ర జ్ఞానం, సంయమనం, సంతులత అంతే అవసరం. అయితే ముఖ్యంగా అందరూ పాటించవలసినది పరస్పర గౌరవం, అభిమానం, సమానత. అప్పుడు అది నిజమైన ప్రజాస్వామ్య సంస్థ అవుతుంది. ఎవరికి వారు తమ రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయండి. ప్రతీ రాష్ట్రంలో తప్పక జరిగేటట్టు చూడండి. ఇప్పుడు మీ ముందున్నది ఒక్క అంశం కాదు. ప్రతీ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, చర్యలను ఎండగట్టండి. ముఖ్యమైన రంగాలు విద్య, వైద్య, వ్యవసాయ, ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాల గురించి క్షుణ్నంగా అర్థం చేసుకోండి. వీలైనంత వరకు కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలను విసర్జించండి. దేశంలో అన్ని రాష్ట్రాల్లో అలజడి వస్తే అన్నింటినీ నియంత్రించటం కేంద్రానికి కష్టమవుతుంది. ప్రభుత్వాలను, పార్టీలను దేశమంతా వ్యతిరేకిస్తున్నట్టు ఇతర దేశాలకు తెలుస్తుందనే భయముంటుంది.



# బీజేపీకి ఎదురుగాలి

దేశంలోని మూడు రాష్ట్రాల్లో ఇటీవల మూడు అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరిగాయి. ఈ మూడుచోట్లా మూడు వేర్వేరు పార్టీలు గెలిచాయి. స్థూల దృష్టికి ఇది సాధారణ విషయంలా అనిపించవచ్చు. కానీ ఈ ఫలితాలకు ఓ ప్రత్యేకత ఉన్నది. ఇవి దేశంలో మారుతున్న లేదా చాలావరకు మారిపోయిన రాజకీయ దృశ్యాన్ని మనకు చూపిస్తున్నాయి. పన్నెండేండ్ల పైచిలుకు కాలంగా కేంద్రంలో సాగుతున్న ఎన్డీయే అప్రతిహత పాలనకు ఇవి ప్రమాద ఘంటికలు మోగించాయని మాత్రం చెప్పవచ్చు. మొదటిది, నితీశ్‌కుమార్‌ను తప్పించి బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన బీహార్‌లో సుప్రసిద్ధ ఎన్నికల విశ్లేషకుడు, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ బాంకీపుర్ ఉపఎన్నికలో సాధించిన అనూహ్య విజయం. పాలకపక్ష అభ్యర్థిపై 19 వేల ఆధిక్యంతో ఆయన గెలుపొందారు. బీజేపీ కంచుకోట బద్దలు చేశాడంటూ ఆయనపై ప్రశంసలు కురుస్తుండటం గమనార్హం. రెండోది, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారం దక్కించుకున్న మధ్యప్రదేశ్‌లోని దతియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీపై 6 వేల ఓట్లతో గెలువడం. మూడోది, గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి సతీశ్ గోవింద్‌భాయ్ పటేల్‌ను 30 వేల మెజారిటీతో ఓడించడం. దేశం ఎంతో ఆసక్తిగా గమనించిన ఈ మూడు ఉపఎన్నికల ఫలితాలు నిర్ణాయకమైనవి కాకపోవచ్చు గానీ, ఓటర్ల ఆలోచనలో వచ్చిన మార్పునకు, బీజేపీకి వీస్తున్న ఎదురుగాలికి అవి అద్దం పడుతున్నాయని మాత్రం చెప్పవచ్చు. పై మూడు ఫలితాల్లో ప్రశాంత్ కిశోర్ విజయం గురించే ఎక్కువగా చర్చ జరుగడానికి పలు కారణాలు ఉన్నాయి. ఆయన గెలిచిన బాంకీపుర్ నియోజకవర్గం బీజేపీకి ప్రతిష్ఠాత్మకమైందని చెప్పాల్సిన పనిలేదు. పైగా అది ఆ పార్టీ జాతీయ అధ్యక్షునిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయ్యింది కావడం, ఉపఎన్నికలో అధికార పార్టీ గెలువడం అనే ఆనవాయితీకి విరుద్ధంగా ఫలితం రావడం గమనార్హం. 31 సంవత్సరాలుగా గెలుస్తున్న స్థానం కోల్పోవడం అనేది పాలకపక్షానికి ఓ సంకేతం. గత ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపని జన్ సురాజ్ పార్టీ నేత భారీ మెజారిటీతో గెలువడం ఓటర్ల దృక్పథంలో వచ్చిన కచ్చితమైన మార్పును సూచిస్తున్నది. మధ్యప్రదేశ్‌లోనూ పాలక బీజేపీకి చుక్కెదురు కావడం మరో సంకేతం. ఇక సంప్రదాయికంగా బీజేపీ రాష్ట్రంగా కొనసాగుతున్న గుజరాత్‌లో అధికారపక్ష అభ్యర్థి గెలిచినప్పటికీ 2022లో వచ్చిన లక్ష ఓట్ల ఆధిక్యం కాస్తా 30 వేలకు పడిపోవడం పార్టీ బలం సన్నగిల్లిందనడానికి నిదర్శనం ఏ రకంగా చూసినా ఈ మూడు ఫలితాలు బీజేపీకి, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీకి కునుకు లేకుండా చేసేవిగానే ఉన్నాయి. ఓటర్లు ప్రత్యామ్నాయాల వైపు, ప్రయోగాల వైపు చూస్తున్నారని ఈ మూడుచోట్ల వెలువడిన ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయి. బీజేపీ సహా బీహార్‌లో పాతుకుపోయిన పార్టీలకు వారు అంతగా ప్రాముఖ్యం ఇవ్వలేదు. బాంకీపుర్‌లో తాము 'కుక్కను నిలబెట్టినా, పిల్లిని పోటీకి పెట్టినా' గెలుపు తమదేనని విర్రవీగిన బీజేపీకి ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారు. ఢిల్లీలో జెన్-జీ ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీపై ఉధృత స్థాయిలో దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఉపఎన్నికలు జరిగాయనేది గుర్తుంచుకోవాలి.




# శామ్‌సంగ్‌కు షాక్.. భారీ నష్టపరిహారానికి ఆదేశం

శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్‌కు భారీ షాక్ తగిలింది. ప్రముఖ స్విస్ వాచ్ తయారీ సంస్థ స్వాచ్ గ్రూప్ ఏజీకి శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది. స్వాచ్ గ్రూప్‌కు చెందిన బ్రెగ్యూట్, బ్లాంక్‌పెయిన్, ఒమేగా, లాంగిన్స్, టిస్సోట్ వంటి లగ్జరీ వాచ్ బ్రాండ్ల డిజైన్లను పోలిన స్మార్ట్‌వాచ్ వాచ్-ఫేస్ యాప్‌లను తన గెలాక్సీ యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉంచినందుకు శామ్‌సంగ్ 11.6 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1.16 కోట్లు) చెల్లించాలని లండన్ హైకోర్టు ఆదేశించింది. ఈ వివాదం 2015 అక్టోబర్ నుంచి 2019 ఫిబ్రవరి మధ్య కాలానికి సంబంధించినది. స్వాచ్ గ్రూప్ వాచ్‌ల డయల్స్, డిజైన్లు, ట్రేడ్‌మార్క్‌లను పోలిన డిజిటల్ వాచ్ ఫేస్ యాప్‌లను శామ్‌సంగ్ గెలాక్సీ యాప్ స్టోర్‌లో థర్డ్ పార్టీ డెవలపర్లు అందుబాటులో ఉంచారు. ఈ యాప్‌లు శామ్‌సంగ్ స్వయంగా రూపొందించినవి కాకపోయినా, వాటిని యాప్ స్టోర్‌లో అనుమతించడం, ప్రదర్శించడం ద్వారా ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనకు శామ్‌సంగ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని కోర్టు తేల్చింది. ఈ కేసులో స్వాచ్ గ్రూప్ తొలుత సుమారు 170 మిలియన్ డాలర్ల నష్టపరిహారం కోరింది. అయితే శామ్‌సంగ్ మాత్రం నష్టం చాలా స్వల్పమని, గరిష్ఠంగా సుమారు 300 డాలర్లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వాదించింది. ఈ వాదనను కోర్టు అంగీకరించలేదు. న్యాయమూర్తి మార్కస్ స్మిత్ ప్రకారం, స్వాచ్ బ్రాండ్లను తక్కువ లేదా ఎలాంటి ధర లేకుండా డౌన్‌లోడ్ చేసుకునే యాప్‌ల రూపంలో శామ్‌సంగ్ యాప్ స్టోర్‌లో ప్రదర్శించడం ఆ బ్రాండ్ల విలువకు గణనీయమైన నష్టం కలిగించింది. మొత్తం నష్టపరిహారంలో సుమారు 10 మిలియన్ డాలర్లు శామ్‌సంగ్ యాప్ స్టోర్‌లో స్వాచ్ బ్రాండ్లను ప్రదర్శించడం వల్ల కలిగిన నష్టానికి కేటాయించినట్లు నివేదికలు వెల్లడించాయి. అదనంగా, ఉల్లంఘనకు సంబంధించిన వాచ్-ఫేస్ యాప్‌లు యూకే, యూరోపియన్ యూనియన్‌లో సుమారు 1.6 లక్షల సార్లు డౌన్‌లోడ్ అయిన అంశాన్ని కూడా న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారు. తాజా తీర్పుపై శామ్‌సంగ్ స్పందిస్తూ.. కోర్టు నిర్ణయాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, అప్పీల్‌తో సహా అన్ని చట్టపరమైన మార్గాలను పరిశీలిస్తామని తెలిపింది. మరోవైపు, శామ్‌సంగ్ ఉల్లంఘన తీవ్రతను పదేపదే తగ్గించి చూపేందుకు ప్రయత్నించిందని స్వాచ్ గ్రూప్ విమర్శించింది. ఇదే 10 స్వాచ్ బ్రాండ్లు శామ్‌సంగ్‌పై అమెరికాలో దాఖలు చేసిన ప్రత్యేక కేసు కూడా పెండింగ్‌లో ఉంది.

# జియో రీచార్జ్ ప్లాన్: 98 రోజులు అదిరిపోయే బెనిఫిట్స్!

మొబైల్ రీఛార్జ్ విషయంలో ఎక్కువ వ్యాలిడిటీతో పాటు రోజువారీ డేటా, అపరిమిత 5జీ, కాలింగ్, ఎస్ఎంఎస్, ఎంటర్‌టైన్‌మెంట్, ఏఐ సేవలు అందించే ప్లాన్లకు ప్రస్తుతం వినియోగదారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రిలయన్స్ జియో అందిస్తున్న రూ.999 ప్రీపెయిడ్ ప్లాన్ పలు ప్రయోజనాలతో ఆకట్టుకుంటోంది. ఒక్కసారి రీఛార్జ్ చేసుకుంటే 98 రోజుల పాటు సేవలు పొందొచ్చు.

**98 రోజుల వ్యాలిడిటీ.. 196 జీబీ డేటా**

రూ.999 ప్లాన్‌లో 98 రోజుల వ్యాలిడిటీతో ప్రతిరోజూ 2 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. అంటే మొత్తం వ్యాలిడిటీ కాలంలో 196 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. దీంతో పాటు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు అందిస్తారు. తరచూ రీఛార్జ్ చేసుకోవాల్సిన అవసరం లేకుండా దాదాపు మూడు నెలల పాటు ఈ సేవలను పొందవచ్చు.

**5జీ యూజర్లకు అపరిమిత డేటా**

5జీ స్మార్ట్‌ఫోన్‌తో పాటు జియో 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న ప్రాంతంలో ఉన్న వినియోగదారులకు ఈ ప్లాన్‌తో అపరిమిత 5జీ డేటా ప్రయోజనం లభిస్తుంది. 5జీ సేవలు అందుబాటులో లేకపోతే రోజువారీ 2 జీబీ హైస్పీడ్ డేటా వినియోగం పూర్తయ్యాక ఇంటర్నెట్ వేగం 64 కేబీపీఎస్‌కు తగ్గుతుంది.

**జియోహాట్‌స్టార్, గూగుల్ ఏఐ ప్రో**

ఈ ప్లాన్‌లో వినోదం కోసం జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తుంది. అంతేకాకుండా గూగుల్ ఏఐ ప్రో ప్రయోజనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో 5,000 జీబీ గూగుల్ క్లౌడ్ స్టోరేజ్, జెమిని ప్రో యాక్సెస్‌తో పాటు నానో బనానా సహా పలు ఏఐ ఫీచర్లను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జియో క్లౌడ్ ద్వారా అదనంగా 50 జీబీ క్లౌడ్ స్టోరేజ్ ప్రయోజనం కూడా లభిస్తుంది.

**సబ్‌స్క్రిప్షన్ కొనసాగాలంటే ఇదే కీలకం**

అయితే జియోహాట్‌స్టార్, గూగుల్ ఏఐ ప్రో ప్రీమియం ప్రయోజనాలకు కొన్ని షరతులు వర్తిస్తాయి. ఈ ప్రయోజనాలను యాక్టివ్‌గా కొనసాగించేందుకు తదుపరి నెలల్లో కనీసం రూ.349 లేదా అంతకంటే ఎక్కువ విలువైన జియో ప్రీపెయిడ్ రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే 98 రోజుల వ్యాలిడిటీ, 196 జీబీ డేటా, అపరిమిత కాలింగ్, 5జీ డేటాతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్, ఏఐ సేవలను ఒకే ప్లాన్‌లో కోరుకునే వారికి రూ.999 రీఛార్జ్ ఆసక్తికరమైన ఆప్షన్‌గా నిలుస్తోంది.



# చక్కెర ధరలపై కేంద్రం మాస్టర్ ప్లాన్..

దేశీయ మార్కెట్లో ఇటీవల భారీగా పెరిగిన చక్కెర ధరలు ఇప్పుడు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు, మార్కెట్‌పై పెంచిన పర్యవేక్షణతో చక్కెర మిల్లుల వద్ద ధరలు గణనీయంగా తగ్గాయి. ఇప్పటికే ఎక్స్-మిల్ ధరలు 18 శాతం మేర తగ్గి కిలోకు రూ.55కు చేరుకున్నాయి. దీంతో రానున్న రోజుల్లో చిల్లర మార్కెట్లోనూ ధరలు తగ్గే అవకాశం కనిపిస్తోంది.



**ఒక్కసారిగా ఎందుకు పెరిగాయి చక్కెర ధరలు?**

గత 15 నుంచి 20 రోజులుగా దేశీయ చక్కెర మార్కెట్లో ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఎక్స్-మిల్ ధర కిలోకు రూ.67 వరకు చేరి సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో టోకు, చిల్లర మార్కెట్లలోనూ చక్కెర ధరలు భారీగా పెరిగాయి. ఈ పరిస్థితి నేరుగా సామాన్య వినియోగదారులపై ఆర్థిక భారాన్ని పెంచింది. కేంద్ర ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా వెల్లడించిన వివరాల ప్రకారం, కొన్ని చక్కెర మిల్లులు ఇష్టానుసారంగా ధరలను పెంచడం కూడా ఈ ఆకస్మిక పెరుగుదలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉంది. దీంతో సరఫరా గొలుసులో ధరలపై ఒత్తిడి పెరిగి, కృత్రిమ ద్రవ్యోల్బణ పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం భావించింది.

**ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు**

చక్కెర ధరలు కిలోకు రూ.67 వరకు చేరడంతో కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని నియంత్రించేందుకు కీలక చర్యలు చేపట్టింది. దేశీయ మార్కెట్లో సరఫరా కొరత ఏర్పడకుండా ఉండేందుకు విదేశీ మార్కెట్ల నుంచి చక్కెర దిగుమతులకు మార్గం సుగమం చేసింది. దిగుమతుల ద్వారా దేశీయ మార్కెట్లో చక్కెర లభ్యతను పెంచడంతో పాటు, కొరత భయాన్ని తొలగించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారింది. మార్కెట్లో నిల్వదారులు లేదా ఇతర వర్గాలు సరఫరాను నియంత్రించి ధరలను పెంచే అవకాశాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**అక్రమ నిల్వలపై కఠిన చర్యలు**

చక్కెరను అక్రమంగా నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలను పెంచే ప్రయత్నాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. మార్కెట్ పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తూ, అధిక లాభాల కోసం ధరలను కృత్రిమంగా పెంచే ప్రయత్నాలను అడ్డుకునేలా పర్యవేక్షణను పెంచింది. ప్రభుత్వ చర్యలు, దిగుమతుల నిర్ణయం మార్కెట్‌పై వేగంగా ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. దీంతో కొద్ది రోజుల వ్యవధిలోనే మిల్లుల వద్ద చక్కెర ధరలు గణనీయంగా తగ్గాయి.

**రూ.67 నుంచి రూ.55కు పడిపోయిన మిల్లు ధర**

ప్రభుత్వం తీసుకున్న చర్యల ప్రభావంతో చక్కెర ఎక్స్-మిల్ ధర కిలోకు రూ.67 నుంచి సుమారు రూ.55కు తగ్గింది. అంటే కొద్దికాలంలోనే కిలో ధరలో సుమారు రూ.12 మేర తగ్గుదల నమోదైంది. ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా ప్రకారం, ధరల తగ్గుదల ఇక్కడితో ఆగే అవకాశం లేదు. దిగుమతి చేసుకున్న చక్కెర నిల్వలు దేశీయ మార్కెట్లకు పూర్తిగా చేరిన తర్వాత సరఫరా మరింత మెరుగుపడి, ఎక్స్-మిల్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**రిటైల్ మార్కెట్లోనూ ధరలు తగ్గే అవకాశం**

మిల్లుల వద్ద ధరలు తగ్గిన ప్రభావం క్రమంగా టోకు మార్కెట్‌కు, అక్కడి నుంచి చిల్లర మార్కెట్‌కు చేరుతుంది. ప్రస్తుతం టోకు మార్కెట్లో చక్కెర ధర కిలోకు సుమారు రూ.55కు చేరుకోవడంతో వ్యాపారుల కొనుగోలు వ్యయంపై ఒత్తిడి తగ్గుతోంది. రవాణా ఖర్చులు, స్థానిక వ్యాపారుల మార్జిన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ, రాబోయే రోజుల్లో చిల్లర మార్కెట్లో చక్కెర ధర కిలోకు రూ.60 కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**సామాన్యులకు ఊరట**

చక్కెర ధరలు తగ్గితే రోజువారీ వినియోగదారులతో పాటు పండుగల సమయంలో ఎక్కువగా చక్కెరను ఉపయోగించే కుటుంబాలకు కూడా ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల మధ్య చక్కెర ధరలు తగ్గడం వినియోగదారులకు ఉపశమనం కలిగించే అంశంగా మారింది. మొత్తంగా చూస్తే, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దిగుమతి నిర్ణయం, మార్కెట్ పర్యవేక్షణ, అక్రమ నిల్వలపై కఠిన చర్యల కారణంగా చక్కెర ధరలు భారీగా తగ్గుతున్నాయి. దిగుమతి నిల్వలు దేశీయ మార్కెట్లోకి పూర్తిగా చేరితే ధరలు మరింత తగ్గి, త్వరలోనే కిలో చక్కెర రూ.60 కంటే తక్కువకు లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# జాబ్ మార్కెట్‌లో ఏఐ పాగా.. నియామకాలను ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధస్సు




ముంబై, ఆగస్టు 27: భారతీయ క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు మరింత వ్యూహాత్మకంగా, నైపుణ్య ఆధారితంగా తయారయ్యాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ).. నియామకాల ప్రక్రియను అంతకంతకూ మార్చేస్తున్నది మరి. ఓవైపు నైపుణ్యాలపై దృష్టి పెడుతూనే.. మరోవైపు 86 శాతం సంస్థలు తమ ఉద్యోగ నియామకాల్లో ఏఐకి పెదపీట వేస్తున్నాయని గురువారం విడుదలైన డెలాయిట్ ఇండియా క్యాంపస్ వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్-2026 నివేదిక తెలిపింది. ఆయా రంగాల్లోని 257 కంపెనీలు, 505 క్యాంపస్‌ల అభిప్రాయాలు, తీరుతెన్నుల ఆధారంగా ఈ రిపోర్టు తయారైంది. కంపెనీ యాజమాన్యాలు క్యాంపస్ హైరింగ్ బడ్జెట్లను పెంచుతున్నాయని ఈ తాజా నివేదిక పేర్కొన్నది. ఫ్రెషర్స్‌తోపాటు కెరీర్ ప్రారంభ దశలో ఉన్న ఉద్యోగులను తీసుకొని, వారికి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా తర్ఫీదు ఇచ్చేందుకు సంస్థలు 19 శాతం బడ్జెట్‌ను పెంచాయని వెల్లడించింది. ఇక నియామకాల్లోకి ఏజెంటిక్ ఏఐని లోతుగా తీసుకెళ్తున్న నిర్వాహకులు.. ఇంకోవైపు ప్రధానమైన డిజిటల్, విశ్లేషణాత్మక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం నియామకాల్లో ఇంటర్న్‌షిప్‌ను కూడా బలోపేతం చేస్తున్నారని వివరించింది. ఈ మార్పులు.. సంప్రదాయ క్యాంపస్ హైరింగ్ విధానం నుంచి మరింత నిర్మాణాత్మక, నైపుణ్య ఆధారిత నియామకాల వైపునకు కంపెనీలు మారుతున్నాయన్న దానికి అద్దం పడుతున్నట్టు డెలాయిట్ ఇండియా తమ నివేదికలో అభిప్రాయపడింది.

నేడు అన్ని రంగాల్లో ఏఐ వినియోగం అంతకంతకూ పెరిగిపోతున్నది. ప్రస్తుతం ఏఐ ప్రవేశించని పని లేదంటే అతిశయోక్తి కాదు. ఉద్యోగులతో పోల్చితే ఏఐ వాడకం.. కంపెనీలకు లాభదాయకంగా మారుతున్నది మరి. ఒక్కసారి పెట్టుబడి పెడితే.. ఆ తర్వాత నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటం.. ఉత్పాదకత పెరుగడం, ముఖ్యంగా మానవ వనరుల ద్వారా ఎదుర్కొనే జీతభత్యాలు, పని గంటలు, సెలవులు, ఇతర ప్రయోజనాలు తదితరాలు లేకపోవడం వంటివి కంపెనీలను ఏఐ దిశగా నడిపిస్తున్నాయి. ఇప్పటికే ఐటీ, ఆటో, లైఫ్ సైన్సెస్, తయారీ, టెక్నాలజీ రంగాల్లో ఏఐ వినియోగం విపరీతంగా పెరిగినది తెలిసిందే. ఈ క్రమంలో ఆయా సంస్థ లు తమ ఉద్యోగ నియామకాలను తగ్గించుకోవడం, ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్నదీ చూస్తూనే ఉన్నాం.

**10వేల మంది ఏఐ నిపుణులు : విప్రో**

గూగుల్ క్లౌడ్‌తో తమ భాగస్వామ్యం విస్తరణలో భాగంగా కంపెనీల కోసం కొత్త గూగుల్ జెమినీ ఆధారిత పరిష్కారాలపై పనిచేయడానికి 10వేల మంది ఏఐ సర్టిఫైడ్ స్పెషలిస్టులను సిద్ధం చేయబోతున్నట్టు దేశీయ ప్రముఖ ఐటీ రంగ సంస్థ విప్రో గురువారం ప్రకటించింది. ఇందులో టెక్నాలజీ సపోర్ట్ నిర్వహణకు క్లైయింట్ సైట్‌పై పనిచేసేందుకు 1,500 ఫార్వర్డ్-డెప్లాయ్డ్ ఇంజినీర్ల (ఎఫ్‌డీఈలు)నూ అందుబాటులోకి తేనున్నట్టు ఓ ప్రకటనలో సంస్థ తెలిపింది. కాగా, సంస్థాగతంగా జెమినీ ఎంటర్‌ప్రైస్, ఏజెంటిక్ ఏఐల వాడకాన్ని పెంచడానికే విప్రో ఈ మేరకు ప్రణాళికలను రూపొందిస్తున్నది.




# మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.




# రాకా మూవీలో దీపికదే కీ రోల్

ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

# రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.






# వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల



# గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com